# ఆదర్శప్రియుడు

"ప్రపంచంలో ఉండదగినంత పుణ్యం లేదని ఎవరికైనా తెలుస్తూనే ఉంది. కాని నా బోటి వేదాంతికి కనిపించే దేమంటే మనుష్యులు పుణ్యాత్ములు కావటానికి చేసే వ్యర్థ ప్రయత్నం – తమ ఆత్మశక్తికి మించిన ప్రయత్నం. ఈ ప్రయత్నం పాపహేతువవుతున్నది... కొన్ని కొండగుర్తులు పెట్టుకొని కొన్ని నియమాలవలంబించి పుణ్యం చెయ్యగలమనే భ్రమ మనుష్యులకు పోవాలి. పుణ్యం ఆత్మవికాసం వల్ల కలగవలసింది కాని కేవలం నిగ్రహం వల్ల కాదు. చేతగాని నిగ్రహం ప్రమాదకరం... జీవితంలో పాపాని కాస్కారం లేకుండా పోవాలి గాని, వ్యక్తులు తమకు తామే పుణ్యాత్ములై పోవాలనేది కల్లోమాట... మనమంతా కొంతపాపం చేసి తీరాలి – నిశ్చింతగా, నిర్విచారంగా. అది మనకూ, ఇతరులకూ కూడా మంచిది."

ఇది సూరి సిద్ధాంతం. వాడి పరిచితుడు పురుషోత్తం కథ చెబుతూ నాతో సూరి ఈ మాటలన్నాడు. వాడి ఈ సిద్ధాంతానికి పురుషోత్తం కథే వ్యాఖ్యానం.

పురుషోత్తం మొదటి నుంచీ ఆదర్శప్రియుడే నంటాడు సూరి. ఈ ఆదర్శప్రియులతో వచ్చే చిక్కేమంటే, వాళ్లు తమ ఆదర్శాలే తప్ప ప్రపంచం పోకడ తెలుసుకోరు. తమ వాతావరణం అర్థం చేసుకోరు. తమ ఆదర్శాలకు, ఇతరులను సులభంగా బలిచేస్తారు. చిన్న క్లాసులు చదివే రోజుల్లోనే పురుషోత్తం ఇటువంటి అవలక్షణాలు కనబరిచాడు. శ్రద్ధగా రోజుకు రెండు గంటలు చదివి, చదివితేరాని ఏ లెక్కల పేపర్లోనో కాలుజారి తప్పి ఊరుకునేవాడు. ఒక పరీక్షలో లెక్కల పేపరు రోజున పురుషోత్తం అకస్మాత్తుగా లేచి నిలబడి వాచరును పిలిచి తన పక్కనే కూర్చున్న పూర్నయ్య అనే కుర్రవాడు తన పేపరులోంచి కాపీ చేస్తున్నాడని ఫిర్యాదు చేశాడు. పూర్నయ్య తను కాపీ చెయ్యటం లేదని పోట్లాడాడు. వాచరు ఇద్దరి పేపర్లూ తీసుకొని పోల్చి చూసి బలవంతాన నవ్వు ఆపుకుంటూ పురుషోత్తానికి పిచ్చి ఫిర్యాదులు చెయ్యవద్దని సలహా ఇచ్చాడు. పూర్నయ్య పురుషోత్తానికి చేతామనుకున్న సహాయం అట్లా పరిణమించింది. ఆ పరీక్షలో పూర్నయ్య తొంబై మార్కులు తెచ్చుకున్నాడు. పురుషోత్తం తప్పి ఊరుకున్నాడు.

స్థూలంగా పురుషోత్తం ఏ రకమంటే, వాడికి వాంఛించటమంటేనే భయం. తప్పుడు

పనులు చెయ్యవలసిన ఆవశ్యకత అందరికీ ఉన్నట్టే వాడికీ ఉండేది. వాడికి లేనిదల్లా ఏమిటంటే ఆ పనులు చేసే ధైర్య సాహసాలు. జ్ఞానం వస్తున్న కొద్దీ తన అసమర్థత యావత్తూ తన మంచి తనమేననుకున్నాడు. ఇతరులు తన మంచితనాన్ని గుర్తించకపోవటం వాడికి చాలా బాధగా ఉండేది. చిన్నతనంలోనే ఒకసారి వాడు వాళ్ల నాన్న దగ్గిర నిజం ఒప్పుకుని చచ్చేటట్టు దెబ్బలు తిన్నాడు. ఆ తరవాత, తన మాదిరిగానే ప్రవర్తించి కథలో కెక్కిన నెల్సను కథ చదివి తనకు జరిగిన అన్యాయానికి పురుషోత్తం చాలా చింతించాడు. పెద్దవాడైన తరవాత తన ప్రత్యేకత అందరికీ తెలియాలని పురుషోత్తం చాలా శ్రమ పడేవాడు. "నాకిప్పటికి ఇరవై రెండేళ్లు. ఈ నాటికీ నేను సిగిరెట్టుగాని, కాఫీగాని ఎరగను! ఇంతవరకూ పరస్త్రీ స్పర్శ ఎరగను. ఇటువంటి విషయాలు ఎవరూ గమనించరు సరే కదా నోరు చేసి చెప్పుకున్నా అందులో విశేషం అర్థం చేసుకోలేరు!" అని వాడు సూరిదగ్గిర వాపోయినాడుట. దానికి సూరి సరి అయిన సమాధానం ఇచ్చాడు. "పిచ్చివాడా, ఇంకా ఆవగింజలో అరభాగం కాలేదు. రేపు మొదలుపెట్టి సంవత్సరం లోపల నువు పదివేల సిగిరెట్లు కాల్చవచ్చు, వెయ్యి కప్పులు కాఫీ తాగవచ్చు. ముప్పైమంది ఆడవాళ్ల పరిచయం సంపాదించవచ్చు. తొందరపడి ఇవాళ నిన్నభినందిస్తే రేపే ఇటువంటి పనులు ప్రారంభించి మా అందరి మాటా ఖాళీ చేస్తావేమోనని మా భయం. అంతకన్న మరేమీలేదు... కాకపోయినా నువు ప్రతిదానికీ గర్విస్తావు. ఈ మధ్య ఒకసారి, నన్నింతవరకూ తేలు కుట్టలేదని నువు గొప్పగా చెప్పుకోలా? ఇటువంటి వాటన్నిటికీ నిన్ను గొప్పగా చూడమంటే ఎవరు చూస్తారు చెప్పు. మేమడిగేదల్లా ఏమంటే నువ్వింతవరకూ కాఫీగాని సిగిరెట్టుగాని తాగక ఏం సాధించావు? నీ వొంటో బలం హెచ్చిందా, నీ మొహాన కళ హెచ్చిందా? నువ్వీ పనులు చెయ్యకపోవటంలో నీ మనో వికాసం ఏం కనిపిస్తున్నది? నీకు కావలసింది మా మెప్పుగాని ఆ పనులు చెయ్యని తృప్తి కాదు."

ఈ మాటలన్నందుకు పురుషోత్తం చాలా రోజుల దాకా సూరితో సరిగా మాట్లాడలేదుట.

ఆ తరువాత కొద్ది కాలానికే పురుషోత్తం భార్య కాపరానికి వచ్చింది. ఆ భార్యను వాడు అన్ని విధాలా దుర్వినియోగపరచసాగాడు. మొదటి సంగతి ఆవిడతో వాడు ఎన్నడూ ఆడదాని మొహం ఎరగనివాడల్లే మాత్రమే కాకుండా ఆడదాని మొహం ఎన్నటికీ ఎరగబోని వాడల్లేకూడ ప్రవర్తించసాగాడు. వాడి భార్య సుగుణవతి, ఏవిధంగానూ అపూర్వమైన మనిషి కాదు. కాని భర్త ప్రవర్తన చూడబోతే తను ఆకాశం నుంచి ఊడిపడ్డ ఏ దేవతోనన్నట్టుగా ఉండటం చూసి ఆవిడ నమ్మలేకపోయింది. ఈ విధంగా పురుషోత్తం భార్యను ఆదర్శప్రాయురాలిగా చూడటమే కాకుండా ఆవిడ దగ్గిర తను ఆదర్శప్రాయుడల్లే

కనిపించటానికి విశ్వప్రయత్నం చెయ్యసాగాడు. తనవంటి అపూర్వవ్యక్తి, అపూర్వరసికుడూ, అపూర్వభర్తా లేడనీ, తన అపూర్వప్రేమకు పాత్రురాలైన వ్యక్తి తన భార్య తప్ప మరొకతె కాదనీ ఆవిడకు తెలియాలని వాడి సంకల్పం. కొద్దికాలం పాటు పురుషోత్తం జయించాడనే చెప్పవచ్చు. సుగుణవతి తనను భర్త మోసం చెయ్యటం లేదని సులభంగానే కనిపెట్టింది. కాని వాడు తనను తానే మోసం చెయ్యటానికి ఉద్యమించాడని తెలియటానికి కొంతకాలం పట్టింది. అంత అపూర్వ ప్రేమతో తనకు ఊపిరి సలపకుండా చేసి తన మతి చెడగొడుతున్న మొగుడు తను కోరే చిన్న చిన్న కోర్కెలు ఎందుకు మరిచిపోతాడో సుగుణవతి అర్థం చేసుకోలేకపోయింది. తన అపూర్వభర్త తనకు పూలు తీసుకు రావటం మరిచిపొయ్యేవాడు తను అడిగినా కూడా. జ్ఞాపకం వచ్చిన తరవాత ఎంత నొచ్చుకుంటేనేం? రేపు మళ్లీ మరవడనే ఆశ కూడా సుగుణవతికి క్రమంగా క్షీణించింది. ఆవిడ భర్తను సన్నగా దెప్పటమూ మూతిముడుచుకోవటమూ మొదలుపెట్టింది. పురుషోత్తం అవకాశం దొరికినప్పుడూ దొరకనప్పుడూ తన ప్రత్యేకతను గురించి వేనోళ్ల చెప్పుకోవడం కూడా ఆవిడకు మొహం మొత్తింది. అందుచేత ఆవిడ మొగుణ్ని దాదాపు ఇతర మనుష్యులతో పాటివాడేనన్నట్టు చూడసాగింది.

పురుషోత్తం వేడి యావత్తూ చల్లారింది. హరిశ్చంద్రుడితో చంద్రమతిగాని, నలమహరాజుదగ్గిర దమయంతిగాని, రాముడి విషయంలో సీతగాని తన భార్య మాదిరిగా ప్రవర్తిస్తుందా? భర్త ఏదన్నా చేస్తానంటే, నిర్మొహమాటంగా, "నేను నమ్మను లెండి!" అనేస్తుందా? తనని అందరితోపాటు చూసినందుకు, భార్య తనని అందరికన్నా హీనంగా చూస్తున్నట్టు భావించాడు పురుషోత్తం. "ఎప్పుడన్నా చూడు భార్యా భర్తలకు అత్యాశ లేనప్పుడే సంసారాలు కాస్తో కూస్తో సుఖంగా వెళ్లుతై. చదువుకున్న వాళ్లే కాపరం సరిగా చెయ్యలేరు!" అన్నాడు సూరి.

ఏమయితే నేం? పురుషోత్తం కాపరం వక్రంగా నడవసాగింది. భార్యా భర్తల పరస్పర సంబంధం గరుకు తేలింది. వాళ్లు ఒక విధమైన మూగ వైరం సాధించసాగారు.

సుగుణవతి అపూర్వమైన ఆడది కాకపోయినప్పటికీ ప్రత్యేకించి తప్పు పట్టటానికి ఆమెలో ఏ లోపమూ లేదంటాడు మా సూరి. రంభ కాదు గాని అందగత్తెలలో చేర్చ తగినదే. ఏ మాత్రమూ లొల్లితనంగాని, వెకిలితనంగాని లేదు. ఏ మాత్రమో అతిశయమూ ఇతరులంటే నిర్లక్ష్యమూ ఉన్నా, భర్త సరి అయిన వాడయితే అవి రాణింపుకు రాదగిన గుణాలే. మానాభిమానాలు కల మనిషి.

అటువంటిది క్రమంగా భరించరాని భార్యగా పరిణమించిందంటే ఆ తప్పు చాలా భాగం పురుషోత్తందే. అయితే క్రియకు పురుషోత్తాన్ని పాడు చేసిన మనిషి కూడా సుగుణవతే

అయింది. అంతకు పూర్వం పురుషోత్తం ఆదర్శప్రియత్వాన్ని ఆవిడ మాదిరిగా అవమానించి ఉండిన వారెవరూ లేరు, సూరి తప్ప.

తన భార్య సమస్య వచ్చేటప్పటికి పురుషోత్తం ఎప్పటి మాదిరిగానే తన అశక్తత ప్రకటించాడు. భార్య మీద పగతీర్చుకోవటానికి, ఇతర స్త్రీల వెంట పోవటానికి వాడికి గుండెలేదు. కాని అటువంటి పాపానికి ఒడిగట్టకుండా అంత ప్రయోజకత్వం ప్రకటింతామని వాడికి ఉండి ఉంటుంది. తనకు అందుబాటులో ఉన్న ఇతర స్త్రీలు లేకపోలేదని భార్యకు తెలియజేయటానికి వాడు కొన్ని వ్యర్థ ప్రయత్నాలు చేసినట్టు కనిపిస్తుంది. కాని అవి ఫలించలేదు. ఓర్పుతోనూ, మంచితనంతోనూ భార్యను జయింతామని ప్రయత్నించాడు. తనకున్నదే కాక లేని మంచితనం కూడా భార్య దగ్గిర ఒకప్పుడు ప్రకటించి ఉండటం వల్ల ఈ ప్రయత్నం పూర్తిగా నిరర్థకమై పోయింది. ఆ తరవాత వాడు మామూలుకు భిన్నం లేకుండా కర్మసన్యాసం చేసేసి, ఆ భార్యతోనే అట్లాగే ఏకపత్నీ వ్రతం చేస్తూ వచ్చాడు. అట్లా చెయ్యటంలోనే తన గొప్పతనమంతా ఉందని నలుగురితోనూ చెప్పడం మాత్రం మరచి పోలేదు. "ఎవరి మోక్షం వారిదీ! నా ఆదర్శాలు నేనే సఫలం చేసుకుంటాను. ఇంకొకరి తోడూ అవసరం లేదు. తోడు లేని నష్టమూ నాకు లేదు. మన మంచితనం ఇంకొకరి మీద ఆధారపడితే ఆ మంచితనం ఇంకెంత కాలం నెగ్గుతుంది?" అన్నాడు వాడు సూరితో. ఎంతో వ్యక్తిత్వం కలవాడే అట్లా మాట్లాడటం సాహసం. పురుషోత్తం ఆ మాటలన్నాడంటే అంతకంటె హాస్యాస్పదమైన విషయం మరొకటి ఉండదు. సూరి తనలో తను నవ్వుకున్నాడు.

"ఒక రవ్వ సౌజన్యంగాని, సౌహృదంగాని లేకుండా ఆ భార్యతో వాడెట్లా కాపురం చెయ్యటానికి ఒప్పుకున్నాడో, వాడెంత పశుప్రాయుడో నేనూహించలేను. ప్రతిసారీ పురుషోత్తమే తన ఇంద్రియాలకూ, తద్ద్వారా తన భార్యకూ లొంగి ఉంటాడు. సందేహం లేదు. ఆవిడకున్న అభిమానం వాడికి లేదు!" అన్నాడు సూరి.

ఇట్లా కొంతకాలం గడిచిన తరవాత పురుషోత్తం జీవితంలోకి ఒక కొత్త మనిషి ప్రవేశించింది. ఆవిడ పురుషోత్తం మరదలి అక్కగారు. ఆవిడ సుగుణవతి కంటె ఒకటి రెండేళ్లు పెద్దది. పురుషోత్తం కంటె రెండు మూడేళ్లు చిన్నదీనూ. ఆవిడ భర్త దగ్గిరికి పోనే లేదు. ఈవిడ కాపరానికి వెళ్లక పూర్వమే అతను దేశాంతర్గతుడై పోయినాడు. మళ్లా అతని జాడలేదు. పురుషోత్తం మరదలు కాపరానికి వచ్చేటప్పుడు ఆవిడ కూడా వెంట వచ్చింది, రెండు మూడు నెల్లు చెల్లెలికి సహాయంగా ఉండటానికి. ఆవిడ పేరు రాజేశ్వరమ్మ. రాజమ్మ అనే వాళ్లు.

ఆవిడలో కల్లా ఆకర్షవంతమైన విషయం ముఖం భంగిమ. మొహంలో ఎప్పుడూ

ఒక పెద్ద విచారం – తీరని లోటు – ఒకటి కనిపిస్తూ ఉండేది. ఆవిడ చరిత్రను బట్టి ఆ భావం ఉండటంలో వింతలేదు కూడానూ. ఆమెను చూడగానే అందరికీ పరామర్శించా లనిపించేది. పురుషోత్తానికిశానికాభావమే మరింత గాఢంగా కలిగింది. ఆ మోహానికి హాసరేఖ తెప్పించగలిగితే!

రాజమ్మ మీద తన బుద్ధి స్వేచ్ఛగా కొంత దూరం వెళ్లి, పగటి కలలు కొన్ని కనే వరకూ పురుషోత్తం తన ఏకపత్నీవ్రతం పాడవుతున్నదని గుర్తించలేదు. అప్పటికి వాడి మనస్సు అవశమై పోయింది. రాజమ్మను స్పృశిస్తే ఆమె శరీరం ఎట్లా పులకరించేదీ, ముద్దు పెట్టుకుంటే ఆమె పెదవులెంత వేడిగా ఉండేదీ, ఆలింగనం చేసుకుంటే ఆమె ఎట్లా పరవశురాలైపొయ్యేదీ వాడికి చూసినట్టు తెలుసును ఇప్పటికే!

ఒకవేళ నిగ్రహించుకోవటానికి పురుషోత్తం ప్రయత్నింతామన్నా రాజమ్మ పడనిచ్చేటట్టు కనిపించలేదు. చక్కదనంలో చైతన్యం చూపించింది రాజమ్మ. ఇతరుల అందం స్థావరంగా ఉన్నట్టుంటుంది. పురుషోత్తం చూస్తుండగా రాజమ్మ చక్కదనం తొణికిసలాడసాగేది. ఇది ఏమిటో పురుషోత్తం అవగాహన చేసుకోలేక పోయినాడు. చక్కదనం తొణికిసలాడటమంటే అది మాటల చమత్కారమే ననుకున్న వాడల్లా ఇప్పుడదేమిటో తెలుసుకున్నాడు. అదీకాక రాజమ్మ తనవంక ప్రత్యేకంగా చూస్తున్నట్టూ తనతో మాట్లాడినప్పుడు ప్రత్యేకించి మాట్లాడుతున్నట్టూ వాడికర్థమయింది. ఆవిడ అందరికేసీ అట్లా చూడదనీ, అందరితోనూ ఆ గొంతుతో మాట్లాడదనీ వాడికి స్పష్టమయింది; కాని ఆ తేడా ఎందులో ఉన్నదీ కనిపెట్టలేకపోయినాడు. కాని రాజమ్మ కూడా వెకిలి మనిషి కాదు. ఆవిడ వాణ్ని ఆకర్షించటానికి ఈషణ్మాత్రమైనా ప్రయత్నించలేదు. తనే వాడి చేత ఆకర్షించబడుతున్నట్టు కనపడ్డది. అంతేకాదు, తన మనస్సు నిగ్రహించుకోవటానికి విశ్వప్రయత్నం చేస్తున్నదానల్లే కనిపించింది.

ఒకనాటి సాయంకాలం పురుషోత్తం తమ్ముడింటికి వెళ్లేటప్పటికి రాజమ్మ ఒకతేవుంది. తమ్ముడూ మరదలూ సినిమాకు వెళ్లారు. ఒంటరిగా రాజమ్మను చూడగానే ఒక్కసారిగా ఆశా, భయమూ కలిగినై. ఆ రెంటి సమ్మేళనమే దడ. పురుషోత్తం దడదడలాడ సాగాడు. నోట మాట రాలేదు. వెళ్లిపోదామంటే కాళ్లు వణికినై. అప్పుడు రాజమ్మ ఏ మాత్రం ప్రోత్సాహమిచ్చి ఉండినా పురుషోత్తం ఏమై ఉండునో. కాని ఆ రోజున ఆవిడ ప్రత్యేకించి నిర్లక్ష్యంగా కనిపించింది. ఈ మనిషి ఒకప్పుడు నా వంక తృష్ణతో చూసిన మనిషేనా? నేనే పొరపాటు పడ్డానా? అనుకున్నాడు పురుషోత్తం. రాజమ్మ అతనికేసి చూడనే లేదు. ముభావంగా మాట్లాడింది. సరిగా అడిగినదానికే సమాధానం చెప్పింది – అతనితో మాట్లాడాలని ఏమాత్రమూ లేని దానల్లే.

తన తమ్ముడు లేడనీ ఇప్పట్లో రాడనీ తెలుసుకున్న తరవాత వెళ్లిపోవటం తప్ప

తనకిక కర్తవ్యం ఏమీలేదు. అయినా ఒక నిమిషం నిలబడ్డాడు. రాజమ్మ ఎంత మూఢురాలైనా దాన్ని బట్టే ఏదో ఉందని గ్రహించవచ్చును. ఆడవాళ్లు ఇటువంటివి కనిపెట్టరనా? కనిపెట్టి కూడా మగవాడికి సహాయం చెయ్యరు! రాజమ్మ వచ్చి తన మీద పడాలనే కాదు, తిట్టి వెళ్లగొట్టినా బాగుండును, విషయం పరిష్కారమవుతుంది. రాజమ్మ ఆ పని చెయ్యలేదు.

ఆ నిమిషమూ కానిచ్చి ఒక దీర్ఘమైన నిట్టూర్పు వదిలి, "సరే నే పోతా!" అన్నాడు పురుషోత్తం కదలకుండానే. వంట ఇంటో నించి రాజమ్మ "ఊఁ!" అన్నది. పోవేమని ఆవిడ అడగరాదూ? అంత పెద్ద నిట్టూర్పూ తన చెవిని పడనట్టే నటించింది రాజమ్మ. తప్పనిసరిగా పురుషోత్తం కదిలాడు. కాని వాడు బయటికి పోలేదు. వంటిల్లు ప్రవేశించాడు. నిప్పు రాజేస్తున్న రాజమ్మ వాడివంక ప్రశ్నార్థకంగా చూసింది. "పోతానన్నవాడివి పోవేం?" అని ఆ చూపును తర్జుమా చేసుకొన్నాడు పురుషోత్తం. వెళ్లి ఆవిడకు ఒక గజం దూరంలో నుంచున్నాడు. ఆపైన ఏమీ చెయ్యలేకపోయినాడు. "రాజమ్మకు మెదడుంటే ఇప్పుడు చేసినంత వరకు చాలును!" అని వాడి అంతరాత్మ చెబుతున్నది.

రాజమ్మ వాడి మీది నుంచి కళ్లు తియ్యలేదు. ఆమె మొహంలో మామూలుగా ఉండే దైన్యం పదింతలుగా కనిపించి ఉంటుంది పురుషోత్తానికి.

"వెళ్లండి!" అన్నది రాజమ్మ మృదువుగా. పురుషోత్తం పూర్తిగా వివశుడైపోయినాడు. చప్పున మరో అడుగు ముందుకు వేసి ఆమె పక్కనే కూర్చుని ఒక చేత్తో ఆమెను చుట్టాడు. వాడి చెవులలో పన్నెండు జలపాతాల హోరు ప్రతిధ్వనించుతున్నది. కళ్లను దట్టమైన పొరలు కమ్మేసినట్టయి పోయింది. మొహం పక్కకు వంచి రాజమ్మను ముక్కుకూ మూతికీ మధ్యగా ముద్దుపెట్టుకున్నాడు. ఆ క్షణంలో కూడా రాజమ్మ ఎంతో నిగ్రహం ప్రకటించింది. ఆవిడ వాణ్ని తోసెయ్యలేదు. పెనగులాడలేదు. వాడికి వశము అయిపోలేదు. "తప్పు! ఊరుకోండి! ఎవరో పాపిష్టి వాళ్లు చేసే పని!" అని హెచ్చరించింది.

"నీ కోసం చచ్చిపోతున్నాను!" అన్నాడు పురుషోత్తం పాపిష్టిపనిని సమర్థించుతూ.

"ఇప్పుడే ఇట్లా ఉంటే రేపు నేను ఊరికి పోయిన తరవాత ఏం చేస్తారు? నేనిక్కడ ఉన్నప్పుడు మాత్రం ఏం చేస్తారు? నిష్కారణంగా వ్రతభంగం దేనికి? ఈసారికి తొందరపడితే పడ్డారు, ఇక ఎన్నటికీ ఎవర్నీ ఇట్లా చెయ్యకండి!" అన్నది రాజమ్మ, ఉపాయంగా పురుషోత్తాన్ని విడిపించుకుని ఎడంగా జరిగి.

"ఎందుకో నాకు నీమీద ఇంత భ్రమకలిగించాడు దేవుడు!" అన్నాడు పురుషోత్తం దిగులుగా. "కొంచెం ఆలోచించండి. ఇప్పుడు మీరు తొందరపడి ఏదన్నా చేస్తే అవి మరిచిపోలేక బతికి ఉన్నన్నాళ్లూ నన్నేడుస్తూ ఉండమన్నారా? నేను సుఖానికి తట్టుకోలేను!" అన్నది రాజమ్మ.

పురుషోత్తం కొంచెం సేపు మాట్లాడలేదు. ఆఖరుకు తనను తానే నిందించుకుంటూ "నాది వట్టి పాపిష్టి పుట్టుక. నేను సుఖపడటానికి పుట్టలేదు. అందుకనే నిన్ను తృప్తిగా ముద్దు కూడా పెట్టుకోలేక పోయినాను. నీ తప్పేమీ లేదు!" అన్నాడు.

"ఇంత చదువుకున్నారు. మీ చదువంతా ఏమయింది? మీరు కోరేది తప్పుకాదా?" అన్నది రాజమ్మ.

పురుషోత్తం తనని బంధించి ఉన్న తాళ్లన్నీ తెంపుకోవటానికి ఒక్కసారిగా ప్రయత్నిస్తున్న వాడల్లే తన విశ్వాసాల మీద తనే తిరగబడుతూ, "కాదు! నేను నిన్ను కోరటం తప్పయితే ప్రపంచంలో ఒప్పే లేదు. నేను ఎవరినీ మోసగించటం లేదు. అన్యాయం చెయ్యటం లేదు. నీకోసం తపించిపోతున్నాను. నీ కోసం ప్రాణం విడుస్తాను. నా బతుకంతా నీమయమైపోయింది. రోజుల్లో లక్షసార్లు జ్ఞాపకం వస్తావు. రాత్రి నా కలల నిండా నువ్వే. నేను నీకోసం తపించటంలో తప్పేమిటి? మోసమేమిటి?" అన్నాడు ఉద్రేకంతో.

"తప్పు కాకపోతే నన్ను బహిరంగంగా మోసం చేస్తారని నేననటం లేదు. నాకు చెయ్యదగిన అన్యాయం దేవుడే చేశాడు. మీ కోసం ఏ ఏట్లో దూకమన్నా దూకుతాను. లోకమంతా నన్ను నానా మాటలన్నా పడి ఊరుకుంటాను. కాని మీ సుగుణవతి సంగతేమిటి? మీరు నాకోసం కలవరించటం ఆవిడకు అన్యాయం కాదా! ఆవిడ ఏ తప్పు చేసింది చెప్పండి? ఆవిడకు మీ మీద ఏ హక్కు లేదా?" అన్నది రాజమ్మ.

పురుషోత్తం ఇంకా ఉద్రేకంతోనే "ఏమీ లేదు!" అన్నాడు. "అసలు దానికి నేనవసరం లేదు. నేనే దాన్ని పట్టుకు వేళ్లాడుతున్నాను. ఒక సంవత్సరం వరకూ నేను దానితో మాట్లాడక పోయినా దానికి దిగులుండదు" అన్నాడు.

"నేను నమ్మను. మీకాడదాని మనస్సు తెలియదు. ఏ ఆడదీ అట్లా ఉండదు!" అన్నది రాజమ్మ.

"నేను రుజువు చేస్తాను. నా భార్యకూ నాకు ఉన్నదల్లా పశు సంబంధమే. అది కాస్తా నేను విసర్జించితే నాకు నా భార్యా కంటె పరస్త్రీ ఉండబోదు. అట్లా పరస్త్రీగా ఉండటానికి నా భార్యకేమీ అభ్యంతరం లేదు. ఇక నిన్ను కోరటంలో నా భార్యకు నేను చేస్తున్న అన్యాయం ఏముందీ?"

"మీ మాటలు నేను నమ్మలేకుండా ఉన్నాను" అన్నది రాజమ్మ.

"అందుకనే ఆరునెల్లు బ్రహ్మచర్యం నడిపి చూపిస్తాను. ఆ తరవాత నాకొక ముద్దయినా ఇస్తావా?"

వాడి కవిత్వానికి లొంగిపోయింది రాజమ్మ. "తీసుకోండి. నా ముష్టి ముద్దు కోసం ఆరు నెల్లు బ్రహ్మచర్యం అవసరం లేదు!" అని ఆవిడ మొహం అందించింది. ఈసారి పురుషోత్తం రాజమ్మను ఆప్యాయంగా ముద్దు పెట్టుకున్నాడు.

"ఆడదాని ముద్దుకు మొహం వాచిన వాడల్లే అయిపోయినాను. ఇప్పుడు నాలో కొత్తగా మగతనం ప్రవేశించినట్టయింది. నేను నా భార్యతో ఎట్లా కాపరం చేస్తున్నానో ఊహించు!" అన్నాడు పురుషోత్తం.

"ఇక వెళ్లండి. ఆవిణ్ని కాస్త దయతో చూడండి. ఇద్దరూ సుఖంగా ఉండండి. నిష్కారణంగా కాపరం చెడగొట్టుకోకండి!" అన్నది రాజమ్మ.

పురుషోత్తం మునిగిపోతున్న వాడల్లే రాజమ్మను గట్టిగా పట్టుకుని "నేను పోలేను. ఇక నువ్వు నా కెన్నటికీ దొరకవు! నీ కోసం ఏ తపస్సు చెయ్యమన్నావు? చేస్తాను. ఇక ఎట్లాగూ నా భార్యతో నేను కాపరం చెయ్యబోవటం లేదు. ఇతర విషయాలట్లా ఉంచి నిన్ను కౌగిలించుకొని నీకు ద్రోహం చెయ్యలేను. నీ కోసం ఏం చెయ్యమన్నా చేస్తాను. ఎంత నిందపాలైనా అవుతాను – నువ్వు నాతో వచ్చేసేటట్టయితే, ఎక్కడికైనా పోదాం!" అన్నాడు.

"నా సంగతి వదిలి పెట్టెయ్యండి. నేను బతికిన వాళ్లల్లో జమే కాదు" అన్నది రాజమ్మ.

"అట్లా కాదు. నా భార్యకు నిజంగానేనవసరం లేదని రుజువు చేస్తే నాతో వచ్చేస్తావా?" అన్నాడు పురుషోత్తం.

"మీ భార్యకు మీరక్కర్లేకపోవటమేమిటి? ఎవరన్నా నవ్వుతారు" అన్నది రాజమ్మ. కాని పురుషోత్తం తన భార్యకు తను అక్కర్లేని మాట రుజువు చెయ్యదలుచుకున్నాడు. బ్రహ్మచర్యం అవలంబించటం మంచి పద్ధతిగా కనిపించింది. అది రాజమ్మ కోసం తను చేసే తపస్సు. తన వల్ల సుఖం లేదని రూఢిగా తెలిసిన మర్నాడు తన భార్య తనను పూర్తిగా విసర్జించి పుట్టింటికైనా వెళ్లిపోతుంది. ఈ లోపల తనను ఆకర్షించటానికి, తన తపస్సు భంగం చెయ్యటానికి సుగుణవతి ఎన్ని ప్రయత్నాలైనా చేస్తుంది. వాటికి తాను లొంగకుండా ఉండాలి. అదివరకల్లా తను భార్యకు లొంగిపోతూ, ఆమె కోరకుండానే తన తుచ్ఛకామానికి తను వశుడవుతూ వచ్చినందుకు తనకిది శిక్ష. తన భార్య తనంతట తనను కోరి వచ్చి ఎంత కాలమైంది! ఆవిడ తనను ఆలింగనం చేసుకుని ఎంత కాలమయింది! అదంతా పూర్తిగా మానేసింది. "నాకు నువ్వక్కర్లేదు. నేను నీకు కావలసి వస్తే నా అభ్యంతరం ఏమీ లేదు – నీ భార్య అయిన పాపం చేత!" అని సుగుణవతి చెప్పకుండా చెబుతూ వస్తున్నది. అంత అవమానకరమైన పరిస్థితుల్లో తను భార్యతో కాపరం చేసినందుకు తనకే ఆశ్చర్యం వేసింది.

ఆలోచించిన కొద్దీ తన తపస్సు గాంధీ మహాత్ముడి సత్యాగ్రహం ధోరణిలో ఉన్నట్టు కనిపించింది. తనది సత్యాగ్రహం కాదా మరి? తన మీద తన భార్య ఒక అధికారం చలాయిస్తున్నది. ఆవిడకు నైతికంగా ఏ హక్కూ లేదు తనకూ రాజమ్మకూ మధ్య అడ్డం

రావటానికి! తను ఆ హక్కుతో పోరాడాలి. ఎట్లా? ఈ తపస్సు ద్వారా! ఎంత కాలం? తన భార్య తన హక్కును విసర్జించే దాకా. "చిత్రం చూడు, పురుషోత్తం రంకుతనం చెయ్యటానికి సంకల్పించుకుని కూడా దాన్ని ఆదర్శప్రాయంగానే చెయ్యదలుచుకున్నాడు! వాడికీ ఆదర్శప్రియత్వం లేకపోతే రాజమ్మ వాడికి సులభంగానే వశమై ఉండేదని నా నమ్మకం. వాడు తర్కించనిస్తే ఆవిడ తర్కించనిచ్చింది గాని నిజంగా ఆవిడకు వాడి మీద గాఢమైన అనురాగమే కలిగిందనుకోవాలి. మరొకరి ప్రణయాన్ని విమర్శించటం అర్థం లేని పనే అయినప్పటికీ ఆవిడ వాడిలో ఏం చూసిందా అని ఆశ్చర్యపడుతూ ఉంటాను. ఆవిడ ఎదట వాడు ప్రేమించదగినవాడుగా పరిణమించి ఉండాలి. అనేక విషయాల్లో ఆవిడ అసామాన్యమైన ఆడదని చెప్పవచ్చు!" అన్నాడు సూరి.

పురుషోత్తం బ్రహ్మచర్యం కొద్దికాలం పాటు వాడనుకున్నట్టే నడిచింది. ఒక వారం పది రోజులు సుగుణవతి భర్త ప్రవర్తనలో మార్పును లక్ష్యం చేసినట్టు కూడా కనిపించలేదు. ఆ తరువాత మరో వారం పాటు మూగగా కళ్లు పెట్టుకుని భర్తకేసి చూడసాగింది. ఆఖరుకు పురుషోత్తానికి తన భార్య కనుచూపు మేర దూరంలో పడుకోవడమే అసంభవమైపోయింది. ఆవిడ తన మంచం మీద వాడివైపు ఒత్తిగిలి పడుకుని వాడికేసి కన్నార్పకుండా చూస్తుంటే వాడి శరీరం నిండా జెర్రులూ, తేళ్లూ పాకినట్టయేది. వాడు పళ్లు బిగపట్టి "పశువు! పశువు!" అనుకునేవాడు.

కాని సుగుణవతి లొంగిపోయి కాళ్ల బేరానికి వచ్చి ఉంటే పురుషోత్తం ఏమయేవాడో తెలియదు. అట్లా మరొక వారం రోజులు గడిచి ఉంటే సుగుణవతి ఏమి చేసి ఉండేదో కూడా తెలియదు. అకస్మాత్తుగా ఆమెకు పెద్ద పెట్టున జ్వరం వచ్చింది. జ్వరం వచ్చిన మర్నాడు వాతం కమ్మేసింది. మూడో రోజు రాత్రి సుగుణవతి చచ్చిపోయింది. "పురుషోత్తం తన భార్యను హత్యచేసినాడని ఒక్కరు కూడా తెలుసుకోలేదు – నేను తప్ప. పురుషోత్తం కూడా ఎరగడు!" అన్నాడు సూరి.

"పురుషోత్తం హత్య చేశాడా!" అన్నాను నిర్ఘాంతపోయి.

"కనీసం వాడి అంతర్బుద్ధి వాడిచేత ఆ పని చేయించింది. అంత విపరీతమైన జ్వరంలో పురుషోత్తం తన భార్యకు వేరే చికిత్స ఏమీ చేయించకుండా నాలుగవున్సుల ఆమదం తాగించాడు. అట్లా వైద్యుడి సహాయం లేకుండా చేయించరాదని వాడికి తెలుసు. కాని జ్ఞాపకం లేదు! వెనక వాడి తమ్ముడికిట్లాగే చేస్తే వాతం కమ్మి అతికష్టం మీద తెప్పరిల్లుకున్నాడు. ఆ విషయం తన భార్య కామదం ఇచ్చేటప్పుడు పూర్తిగా మరిచి పోయినాడు! అదే విచిత్రమైన విషయం. మరిచిపోవటమే కాదు, అయిదారు విరేచనాల అనంతరం సుగుణ స్పృహ తప్పి పడిపోతే అందరూ కంగారు పడుతుంటే, రేపీపాటికల్లా

ఏమీ ఉండదు. విరేచనాలయితే బలహీనంగా ఉన్న మనిషికి నిస్త్రాణ రాదా ఏమిటి? అని వైద్యుణ్ని పిలవలేదు. వైద్యుడు మర్నాడు మధ్యాహ్నం దాకా రానే లేదు. అప్పటికే సగం అయిపోయింది...

"ఆ తరవాత నేను వాణ్ని చూసినప్పుడు వాడి మొహంలో భార్యను పోగొట్టుకున్న వాడి లక్షణాల కన్న భార్యను హత్యచేసిన వాడి లక్షణాలు జాస్తిగా ఉన్నై. నువ్వే చేసావు హత్య! అని వాడి అంతర్బుద్ధి ఘోషిస్తూ ఉండాలి. అది వినే నేర్పు వాడి బుద్ధికి లేదు.

"ఇటీవలనే వాడి అసలు కోరిక ఫలించింది. ఎట్లా ఒప్పించాడో వాడు రాజమ్మ తనతో లోకవిరుద్ధంగా కాపరం చెయ్యటానికి ఒప్పించాడు. అటు తరువాత వాడిలో కలిగిన మార్పు చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. వాడు దాదాపు మన అందరితోపాటు మనిషి అయినాడు! వాడి కొక కొత్త ప్రాణము, కొత్త వ్యక్తిత్వమూ కలిగినై. రాజమ్మతో కాపరం చేస్తున్న కాస్త పాపమూ వాడికి వర్చస్సు కలిగించింది. వాడి జన్మకూ వాడిప్పుడే మొదటిసారి ధైర్యసాహసాలనేవి ప్రకటించాడు. ఒక విధంగా అది వాడికి చాలా మంచే అయింది!" అన్నాడు సూరి.

*ముద్రణ : ప్రతిభ, జూలై 1940*